



'ఆంధ్రజ్యోతి-ఏబీఎన్' ముత్యాల ముగ్గుల పోటీలకు వేళాయె

- నేడు పలాసలో మదర్‌థెరీసా పాఠశాల మైదానంలో..
- రేపు శ్రీకాకుళంలో ఎన్టీఆర్ ఎంసీహెచ్ గ్రౌండ్‌లో నిర్వహణ
- మహిళలకు మాత్రమే అవకాశం
- విజేతలకు నగదు పురస్కారాలు

ఆంధ్రజ్యోతి-శ్రీకాకుళం/పలాస, జనవరి 5: సంక్రాంతిని పురస్కరించుకుని ఏటా 'ఆంధ్రజ్యోతి- ఏబీఎన్' ముత్యాల ముగ్గుల పోటీలు నిర్వహిస్తోంది. మహిళా విజేతలకు నగదు పురస్కారాలు అందజేస్తోంది. ఆనవాయితీ ప్రకారం ఈ ఏడాది కూడా పోటీలు నిర్వహించనుంది. "ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ నిర్వహిస్తున్న కెనరా బ్యాంక్ ముత్యాల ముగ్గుల పోటీలు... పవర్డ్ బై ఎయిమ్స్ విద్యాసంస్థలు, బెంగళూరు... రియల్ పార్టనర్ స్వర్ణసీమ సుకేతన" సహకారంతో జిల్లాలో రెండు చోట్ల జరగనున్నాయి. ప్రథమ విజేతకు రూ.6వేలు, ద్వితీయ విజేతకు రూ.4వేలు, తృతీయ విజేతకు రూ.3వేలు చొప్పున నగదు పురస్కారాలను అందజేస్తారు.

● పలాస మునిసిపాలిటీ పరిధి శివాజీనగర్‌లోని మదర్‌థెరిసా విద్యాలయంలో శనివారం ముత్యాల ముగ్గులపోటీ నిర్వహణకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. శనివారం ఉదయం 10 నుంచి 12గంటల వరకు పోటీలు నిర్వహిస్తారు. ఏర్పాట్లను మదర్‌థెరిసా విద్యా సంస్థల డైరెక్టర్ వజ్జ బాబూరావు, ఛైర్మన్ వజ్జ భవానీ శుక్రవారం పర్యవేక్షించారు.

● శ్రీకాకుళంనగరంలో ఎన్టీఆర్ ఎంసీహెచ్‌స్కూల్ గ్రౌండ్స్‌లో ఆదివారం ముగ్గుల పోటీలు నిర్వహించనున్నారు. ఎటువంటి రుసుము లేకుండా మహిళలు అందరూ ఉచితంగా ఈ పోటీల్లో పాల్గొనవచ్చు. ఇదిలా ఉండగా పోటీల నిర్వహణకు పలాసలో మదర్‌థెరీసా విద్యాలయం యాజమాన్యం సహకారం అందిస్తోంది. శ్రీకాకుళంలో మీనాక్షి ఆసుపత్రి అధినేతలు గొండు శంకర్(కృష్ణప్పపేట), డాక్టర్ గొండు గంగాధర్(గ్యాస్ట్రోఎంట్రాలజిస్ట్) స్పాన్సర్‌గా వ్యవహరిస్తున్నారు. జిల్లాస్థాయిలో గెలుపొందే విజేతను రాష్ట్రస్థాయిలో జరిగే పోటీలకు ఎంపిక చేస్తారు.



పలాసలో ముగ్గుల పోటీలకు సిద్ధమైన మదర్‌థెరిసా క్రీడా మైదానం

నిబంధనలు ఇవీ

ముగ్గుల పోటీల్లో మహిళలు మాత్రమే పాల్గొనాలి. ముగ్గు, రంగులు, పువ్వులు వగైరా సామగ్రి వారే తెచ్చుకోవాలి. చుక్కల ముగ్గులు మాత్రమే వేయాలి. ఎన్ని చుక్కలు, ఎన్ని వరుసలు చెప్పగలిగి ఉండాలి. ముగ్గు వేయడానికి గరిష్ఠ సమయం రెండు గంటలు. ముగ్గును చేతితోనే వేయాలి. జల్లెడ ఉపయోగించేందుకు అనుమతి ఉంటుంది. ముగ్గులో గొబ్బెమ్మలను, బతుకమ్మలను అమర్చవచ్చు. అవి తప్ప ఇతరత్రా వస్తువులను అమర్చకూడదు. ఆసక్తిచూపే మహిళలు నేరుగా పోటీల వద్దకు చేరుకోవచ్చును. మరింత సమాచారం కోసం పలాస-9440543464, శ్రీకాకుళం-9985411526 నంబర్లను సంప్రదించాలి.

వైద్య విద్యార్థుల ఘర్షణ

- డైట్ కేంద్రంలో దాడి.. ఆహార పదార్థాలు ధ్వంసం
- విద్యార్థిని గది బయట క్షుద్రపూజలు
- భయాందోళనలో తోటి విద్యార్థులు
- సంతకం లేని పత్రంతో పోలీసులకు రిమ్స్ అధికారుల ఫిర్యాదు



క్షుద్రపూజలు..



మెస్‌లో పగిలిన గుడ్లు, చెల్లాచెదురైన ఆహార పదార్థాలు



ఘటనపై ఆరా తీస్తున్న సూపరింటెండెంట్ స్వామినాయుడు

శ్రీకాకుళం క్రైం, జనవరి 5: శ్రీకాకుళంలోని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి(రిమ్స్- జీజీహెచ్)లో వైద్య విద్యార్థుల చేష్టలు హద్దు మీరుతున్నాయి. కొంతమంది తీరు తోటి విద్యార్థుల ప్రాణాలతో చెలగాటమాడే స్థాయికి చేరుకుంది. వసతిగృహంలో వైద్య విద్యార్థులు గ్రూపులుగా విడిపోయి పరస్పర దాడులకు పాల్పడుతున్నారు. డిసెంబరు 29న అర్ధరాత్రి దాటాక ఇతర రాష్ట్రానికి చెందిన 8మంది వైద్య విద్యార్థులు గ్రూపులుగా పరస్పర దాడులకు పాల్పడి.. ఫర్నీచర్, వంట సామగ్రి ధ్వంసం చేశారు. ఈ ఘటన మరువక ముందే.. గురువారం రాత్రి మళ్లీ విద్యార్థుల మధ్య ఘర్షణ చోటుచేసుకోవడం చర్చనీయాంశమవుతోంది. రిమ్స్ ఆస్పత్రి వెనుక ఉన్న వైద్య విద్యార్థుల(హౌస్ సర్జన్) వసతిగృహంలో కొంతమంది విద్యార్థులు గురువారం రాత్రి డైట్ మెస్ తలుపులు పగులగొట్టి కొట్లాటకు పాల్పడ్డారు. మెస్‌లో ఉన్న ట్యూబ్‌లైట్లతో దాడి చేసుకున్నారు. 30 అట్టలతో ఉన్న గుడ్లను పగులగొట్టారు. ఐదు బెంచీలను విరగ్గొట్టారు. ఆ సమయంలో పెద్ద పెద్ద శబ్దాలు రావడంతో ఎదురుగా బాయ్స్ హాస్టల్ వద్ద ఉన్న సెక్యూరిటీ గార్డులు అక్కడకు వచ్చారు. దీంతో కొంతమంది విద్యార్థులు మెస్ నుంచి హాస్టల్‌లోకి వెళ్లిపోయారు. ఈ ఘటనపై సెక్యూరిటీ గార్డులు డైటీషన్ శివప్రసాద్‌కు, రిమ్స్ సూపరింటెండెంట్ డా.ఎ.స్వామినాయుడుకు సమాచారం అందించారు. సూపరింటెండెంట్ స్వామినాయుడు, రిమ్స్ కళాశాల ప్రిన్సిపాల్ రవి వెంకటాచలం, డైటిషన్ శివప్రసాద్ శుక్రవారం వేకువజామున డైట్ మెస్‌ను సందర్శించారు. మెస్‌లో వాతావరణం చూసి అవాక్కయ్యారు. విద్యార్థులు రౌడీమూకల్లా ప్రవర్తించడంతో సుమారు రూ.20వేల ఆస్తి నష్టం వాటిల్లినట్టు అంచనా వేశారు. రిమ్స్ పరువు పోకుండా ఈ తప్పును కప్పిపుచ్చుకునేందుకు సూపరింటెండెంట్ ప్రయత్నించారు. కాగా విషయం బయటకు పొక్కడంతో మెస్‌లో విద్యార్థుల దాష్టీకంపై డైటిషన్ శివప్రసాద్ సూపరింటెండెంట్‌కు ఫిర్యాదు పత్రాన్ని అందజేశారు. దానిపై ఎటువంటి సంతకం చేయకుండానే రిమ్స్ అధికారులు టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు పత్రంగా అందించారు. ఫిర్యాదు ఎవరు చేస్తున్నారు? దాడికి ఎవరు పాల్పడ్డారన్న సమాచారం లేకపోవడంతో.. పూర్తి వివరాలతో ఫిర్యాదు పత్రం అందజేయాలని సీఐ పి.శ్రీనివాసరావు రిమ్స్ సిబ్బందికి సూచించారు.

క్షుద్రపూజలతో అలజడి!

రిమ్స్ వైద్య విద్యార్థుల వసతిగృహంలో రూమ్ నెంబర్ 23లో ఉంటున్న విద్యార్థినిపై కొందరు క్షుద్ర ప్రయోగ పూజలు చేశారు. డిసెంబరు 31న అర్ధరాత్రి న్యూఇయర్ వేడుకల్లో భాగంగా విద్యార్థులంతా సందడిలో ఉన్నారు. ఆ సమయంలో హాస్టల్‌లోని 23వ నెంబర్ రూమ్ బయట కర్రకు నల్లగుడ్డ కట్టి బొమ్మను తయారు చేసి పసుపు, కుంకుమ, బియ్యం పిండి, చనిపోయిన ఎలుక, దాని రక్తం చుట్టుపక్కల చల్లి ఓ భయానక వాతావరణం సృష్టించారు. ఈ గదిలో ఉంటున్న భీమవరానికి చెందిన వైద్య విద్యార్థినికి తోటి విద్యార్థులు తలుపు కొట్టి చెప్పడంతో భయాందోళన చెందారు. ఈ విషయంపై రిమ్స్ సూపరింటెండెంట్‌కు ఫిర్యాదు చేసినా నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించారని విద్యార్థులు ఆరోపిస్తున్నారు.

రిమ్స్ అధికారుల నిర్లక్ష్యంతోనే...

హాస్టల్ వార్డెన్‌లు నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో తరచూ ఇటువంటి ఘటనలు చోటుచేసుకుంటున్నాయన్న వాదనలు వినిపిస్తున్నాయి. హాస్టల్‌ను పర్యవేక్షించాల్సిన ప్రిన్సిపాల్, సూపరింటెండెంట్, ఆర్‌ఎమ్‌వోలు కూడా చూసీచూడనట్లు వదిలేస్తున్నారనే ఆరోపణలున్నాయి. ఫిర్యాదులపై దృష్టి సారించకపోవడం కూడా ఈ ఘటనలకు కారణమని రిమ్స్ సిబ్బంది వాపోతున్నారు. అలాగే ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే విద్యార్థులు తరుచూ ఇటువంటి ఘటనలకు పాల్పడుతున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. కొంతమంది విద్యార్థులు అర్ధరాత్రి వరకు బయటకు వెళ్లడం, మద్యం సేవించడం, చెడు వ్యసనాలకు పాల్పడుతున్నా అధికారులు చర్యలు తీసుకోవడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. రిమ్స్ ఛైర్మన్, కలెక్టర్ శ్రీకేష్ బాలాజీ లఠ్కర్ దీనిపై దృష్టి సారించాల్సిన అవసరం ఉందని పలువురు అభిప్రాయ పడుతున్నారు.

పునరావృతం కాకుండా చూస్తాం

డైట్ మెస్‌లో వైద్య విద్యార్థులు దాడికి పాల్పడినట్టు గుర్తించాం. పోలీసులకు ఫిర్యాదు చేశాం. హాస్టల్‌లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నాం. దాడికి కారకులు తెలియరాలేదు. ఇటువంటివి పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటాం.

\- స్వామినాయుడు, సూపరింటెండెంట్, రిమ్స్

నేటి నుంచి చంద్రన్న కార్మిక చైతన్య యాత్ర

- టీఎన్‌టీయూసీ ఆధ్వర్యంలో నిర్వహణకు ఏర్పాట్లు
- 28 రోజులు.. 92 నియోజకవర్గాల్లో పర్యటన
- టెక్కలిలో ప్రారంభించనున్న అచ్చెన్నాయుడు

టెక్కలి, జనవరి 5: చంద్రన్న కార్మిక చైతన్య బస్సుయాత్ర శనివారం నుంచి ప్రారంభం కానుంది. బాబు ష్యూరిటీ.. కార్మికుల భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమం పేరిట తెలుగునాడు ట్రేడ్ యూనియన్ కౌన్సిల్(టీఎన్‌టీయూసీ) ఆధ్వర్యంలో ఈ యాత్ర సాగనుంది. టెక్కలి ఇందిరాగాంధీ కూడలిలో శనివారం మధ్యాహ్నం 2 గంటలకు ఈ యాత్రను టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు కింజరాపు అచ్చెన్నాయుడు ప్రారంభించనున్నారు. 28 రోజులపాటు 92 నియోజకవర్గాల్లో ఈ బస్సుయాత్ర నిర్వహించేలా టీఎన్‌టీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు గొట్టిముక్కల రఘురామరాజు రూపకల్పన చేశారు. అచ్చెన్నాయుడు నియోజకవర్గం టెక్కలి నుంచి టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు నియోజకవర్గం కుప్పం వరకూ చైతన్యయాత్ర కొనసాగుతుందని రఘురామరాజు తెలిపారు. 'జిల్లాలో తొలిరోజు టెక్కలి, నరసన్నపేట, శ్రీకాకుళం, ఎచ్చెర్ల నియోజకవర్గాల మీదుగా యాత్ర కొనసాగుతుంది. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో 2019 నుంచి ఇప్పటివరకూ కార్మికులకు జరిగిన అన్యాయంపై గళం విప్పనున్నాం. టీడీపీ జాతీయ ప్రధానకార్యదర్శి నారా లోకేష్ యువగళం పాదయాత్రలో కార్మికుల కోసం అనేక హామీలు ఇచ్చారు. అవన్నీ ఈ యాత్రలో వివరిస్తాం. రాష్ట్ర ప్రభుత్వం కార్మికుల హక్కులు కాలరాసింది. భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డు నిర్వీర్యం చేసింది. లేబర్ వెల్ఫేర్ బోర్డు తొక్కేసింది. ఇసుకను అధికారపార్టీ నేతల అనుచరులకు కట్టబెటడంతో భవన నిర్మాణ కార్మికులకు పనిలేక 64మంది ఆత్మహత్యలు చేసుకున్నారు. గతంలో వాహన అపరాధ రుసుం రూ.130 ఉండగా గ్రీన్‌ట్యాక్స్ పేరిట రాష్ట్ర ప్రభుత్వం నేడు రూ.1,030కు పెంచింది. రవాణా రంగాన్ని ఆదాయవనరుగా మార్చుకొని కార్మికుల జీవితాల్లో చీకటి నింపింది. వైసీపీ ప్రభుత్వానికి బుద్ధి చెప్పేందుకే కార్మిక చైతన్య యాత్రకు శ్రీకారం చుట్టామ'ని రఘురామరాజు వెల్లడించారు. తనతోపాటు టీఎన్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోగంటి వేణుబాబు, సింధూజ, పరమేశ్వరరావు, స్థానిక నాయకులు దారపు రాము తదితరులు పాల్గొంటారని తెలిపారు.



టెక్కలిలో కార్మికుల చైతన్య యాత్రకు సిద్ధంగా ఉన్న బస్సు

ఉపాధి కోసం వచ్చి.. మృత్యుఒడికి..

- కారు ఢీకొని ఇద్దరు గ్రానైట్ కార్మికుల మృతి
- టెక్కలి మండలం వలియాసాగరం వద్ద ఘటన
- మృతులు ఒడిశా వాసులు

టెక్కలి రూరల్, జనవరి 5: గ్రానైట్ క్వారీలో ఉపాధి నిమిత్తం ఒడిశా రాష్ట్రం గంజాం జిల్లా నుంచి టెక్కలి వచ్చిన ఇద్దరు వలస కార్మికులు రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. టెక్కలి మండలం వలియాసాగరం వద్ద శుక్రవారం వేకువజామున చోటుచేసుకున్న ఈ సంఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఒడిశా రాష్ట్రం గంజాం జిల్లాలోని జలమర-చూడానాగ్‌పూర్, పట్టపూర్ ప్రాంతాలకు చెందిన ఆర్.సంతోష్ కుమార్ దొర(32), కైలాష్ నాయక్(28).. టెక్కలి మండలం ఆంజనేయపురం సమీపంలోని ఓ గ్రానైట్ క్వారీలో కార్మికులుగా పనిచేస్తున్నారు. శుక్రవారం వేకువజామున వీరిద్దరూ ద్విచక్ర వాహనంపై కోటబొమ్మాళి మండలం శ్రీపురంలోని కూరగాయల మార్కెట్‌కు వెళ్తున్నారు. ఈ క్రమంలో టెక్కలి మండలం వలియాసాగరం వద్ద వెనుక నుంచి వారి వాహనాన్ని.. భువనేశ్వర్ నుంచి విశాఖ వెళ్తున్న కారు(ఓడి19ఎస్ 4820) బలంగా ఢీకొంది. దీంతో కార్మికులు ఇద్దరూ అక్కడికక్కడే మృతిచెందారు. ద్విచక్ర వాహనం నుజ్జు కాగా, కారు ముందుభాగం దెబ్బతింది. ప్రమాదాన్ని గమనించిన స్థానికులు టెక్కలి పోలీసులకు సమాచారం అందించారు. టెక్కలి ఎస్ఐ-2 కె.రమేష్ బాబు ఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదం తీరును, మృతదేహాలను పరిశీలించారు. ప్రమాదానికి కారణమైన కారు డ్రైవర్ అరవల్లి సురేష్‌ను అదుపులోకి తీసుకున్నారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం టెక్కలి జిల్లా కేంద్రాసుపత్రికి తరలించి కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేశామని ఎస్ఐ రమేష్‌బాబు తెలిపారు. కాగా మృతుడు సంతోష్‌కుమార్ దొరకు భార్య, ఆరు రోజుల పసికందు ఉన్నారు. ఉపాధి కోసం వచ్చి.. ఊహించని విధంగా రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో ఇరువురి కుటుంబ సభ్యులు రోదిస్తున్నారు.





సంతోష్, కైలాష్ (ఫైల్)



మృతదేహాలను పరిశీలిస్తున్న ఎస్ఐ రమేష్‌బాబు

బెదిరింపులకు భయపడం

- సాధించే వరకూ పోరాడుతాం
- అంగన్‌వాడీలు, మునిసిపల్ కార్మికుల స్పష్టం
- మొక్కవోని దీక్షతో నిరసనలు



శ్రీకాకుళంలో పొర్లుదండాలతో మునిసిపల్ కార్మికుల నిరసన

అరసవల్లి, జనవరి 5: మొక్కవోని దీక్షతో అంగన్‌వాడీ కార్యకర్తలు, మునిసిపల్ కార్మికులు సమ్మె కొనసాగిస్తున్నారు. సమ్మె విరమింపజేసేలా ప్రభుత్వం చర్యలు చేపడుతుండగా.. బెదిరింపులకు భయపడేది లేదని వారు చెబుతున్నారు. సమస్యలు పరిష్కారమయ్యే వరకూ, హామీలు సాధించే వరకూ పోరాడుతామని స్పష్టం చేస్తున్నారు. శ్రీకాకుళంలో శుక్రవారం కూడా సమ్మె కొనసాగించి.. ప్రభుత్వ తీరు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. శనివారం కలెక్టరేట్ వద్ద 24 గంటల రిలే నిరాహార దీక్ష చేపట్టనున్నట్టు అంగన్‌వాడీలు వెల్లడించారు. సమ్మె శిబిరంలో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు మాట్లాడుతూ.. శ్రీకాకుళం మండల వీధిలో మాజీ మునిసిపల్ చైర్‌పర్సన్ ఎంవీ పద్మావతి చొరవతో ఏడు అంగన్‌వాడీ కేంద్రాలు తెరచుకున్నట్టు ప్రచారం సాగుతోందని, దీనిని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలు తెరవకపోయినా.. పని చేస్తున్నట్టు అధికారులు ప్రభుత్వానికి తప్పుడు నివేదికలు ఇవ్వడం సరికాదన్నారు. 25 రోజులుగా సమ్మె చేస్తున్న అంగన్‌వాడీలు పోరాట పటిమను కోల్పోరని, ఎటువంటి బెదిరింపులకూ భయపడేది లేదని స్పష్టం చేశారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం మొండివైఖరి వీడి అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు కె.కళ్యాణి, కె.ప్రమీలాదేవి, రాజేశ్వరి పాల్గొన్నారు.

● శ్రీకాకుళం కార్పొరేషన్ కార్యాలయం వద్ద మునిసిపల్ కార్మికులు పొర్లుదండాలు పెట్టి.. వినూత్న నిరసన తెలిపారు. 'మునిసిపల్ కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ కార్మికులందరికీ సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలి. సమస్యలను వెంటనే పరిష్కరించాలి. లేదంటే సమ్మెను మరింత ఉధృతం చేస్తామ'ని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ అమ్మన్నాయుడు, ఏపీ మునిసిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షుడు అరుగుల గణేష్, ప్రధాన కార్యదర్శి ఎస్.బలరాం ప్రభుత్వాన్ని హెచ్చరించారు. సీఎం జగన్ ఇచ్చిన హామీల కోసం 11 రోజులుగా సమ్మె చేస్తున్నా.. ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం తగదన్నారు. మునిసిపల్ కార్మికుల న్యాయపోరాటానికి ప్రజలంతా మద్దతు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు కళ్యాణరాజు, ఆకుల శంకర్, డి.యుగంధర్, అరుగుల శేఖర్, చిట్టిబాబు, ఎస్.పార్వతి, జె.మాదురి, పి.మల్లమ్మ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా కార్యదర్శి తేజేశ్వరరావు

పరిమితికి మించిన లావాదేవీలపై సమాచారం అందించాలి

- బ్యాంకు అధికారులకు ఎస్పీ రాధిక సూచన

శ్రీకాకుళం క్రైం, జనవరి 5: రాబోయే సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా పరిమితికి మించిన, అనుమానాస్పద బ్యాంకు లావాదేవీలపై సమాచారం ఇవ్వాలని బ్యాంకు అధికారులకు ఎస్పీ రాధిక సూచించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో శుక్రవారం బ్యాంకు అధికారులతో ఎస్పీ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. బ్యాంకు లావాదేవీలు, అక్రమ నగదు స్వాధీనంపై భారత ఎన్నికల సంఘం కొన్ని మార్గదర్శకాలు జారీ చేసిందన్నారు. ఎన్నికలను స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు నగదు లావాదేవీలపై బ్యాంకు అధికారులు దృష్టి సారించాలని చెప్పారు. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో బ్యాంకుల్లో దాచుకున్న ధనాన్ని ఉపయోగించి ఎన్నికల్లో గెలిచేందుకు నాయకులు ప్రయత్నిస్తారని తెలిపారు. దీనికోసం భారీ మొత్తంలో డబ్బులు జమ చేయడం, విత్‌డ్రా చేయడం చేస్తారని చెప్పారు. అటువవంటి లావాదేవీలపై పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. పోలింగ్‌కు ముందు ఆరు నెలల నుంచి పెద్ద మొత్తంలో నగదు లావాదేవీలు జరిగిన వివరాలను అధికారులకు తెలియజేయాలన్నారు. బ్యాంకు లాకర్లను ఎప్పటికప్పుడు తనిఖీలు చేయాలని, ఏటీఎంల వద్ద పటిష్ఠ భద్రత కల్పించాలని, సీసీ కెమెరాలు పనిచేసేలా చూసుకోవాలని తెలిపారు. ఈ సమావేశంలో అదనపు ఎస్పీ జె.తిప్పేస్వామి, డీఎస్పీ కె.బాలరాజు, బ్యాంకు అధికారులు తదితరులు పాల్గొన్నారు.



బ్యాంకు అధికారులతో మాట్లాడుతున్న ఎస్పీ రాధిక

విశాఖ ఆసుపత్రిలో చేరిన స్పీకర్ తమ్మినేని

శ్రీకాకుళం, జనవరి 5(ఆంధ్రజ్యోతి): స్పీకర్ తమ్మినేని సీతారాం మెరుగైన వైద్యం కోసం విశాఖపట్నంలోని మెడికవర్ ఆసుపత్రిలో చేరినట్లు సమాచారం. ఆమదాలవలస నియోజకవర్గంలో గురువారం పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన స్వల్ప అస్వస్థతకు గురయ్యారు. రాత్రి శ్రీకాకుళం మెడికవర్ ఆసుపత్రిలో చేరారు. వైద్యులు పరీక్షించి హెవీ డీహైడ్రేషన్ మినహా ఇతరత్రా సమస్యలేమీ లేవని వెల్లడించారు. మరిన్ని వైద్య పరీక్షల నిమిత్తం విశాఖ మెడికవర్ ఆసుపత్రిలో శుక్రవారం చేరారు. అక్కడ మరికొన్ని వైద్యపరీక్షలు నిర్వహించినట్లు తెలిసింది. స్పీకర్ ఆరోగ్య పరిస్థితిపై అధికారికంగా ఎటువంటి సమాచారం వెల్లడికాలేదు.

కొనసాగుతున్న 'బాబు ష్యూరిటీ'

టీడీపీ అధిష్ఠానం పిలుపు మేరకు జిల్లాలో బాబు ష్యూరిటీ భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. శుక్రవారం వివిధ గ్రామాల్లో టీడీపీ, జనసేన నాయకులు ఇంటింటికీ వెళ్లి మేనిఫెస్టోను ప్రజలకు వివరించారు.

టీడీపీతోనే అభివృద్ధి, సంక్షేమం



భవిష్యత్‌కు గ్యారెంటీలో పాల్గొన్న కలమట వెంకటరమణ

కొత్తూరు: టీడీపీతోనే అభివృద్ధి, సంక్షేమం సాధ్యమని మాజీ ఎమ్మెల్యే కలమట వెంకట రమణ అన్నారు. గూనభద్ర ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి టీడీపీ మేనిఫెస్టోను వివరించి కర పత్రాలను పంపిణీ చేశారు. రానున్న ఎన్నికల్లో టీడీపీని గెలిపించి చంద్రబాబును మళ్లీ సీఎంగా చేయాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు. ● **పాతపట్నం:** వైసీపీ వైఫల్యా లను క్షేత్ర స్థాయిలో వివరించడం ద్వారా టీడీపీ బలోపేతానికి కృషి చేయాలని మాజీ ఎమ్మెల్యే కలమట వెంకట రమణ కోరారు. స్థానిక క్యాంపు కార్యాలయంలో ఏఎస్‌కవిటి, చాకిపల్లి, సోద గ్రామపంచాయతీ ల పార్టీ నేతలతో సమావేశం నిర్వహించారు. బాబు ష్యూరిటీ భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమాలపై సమీక్షించారు. కార్యక్రమంలో పార్టీ బీసీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పైల లక్ష్మయ్య, మిరియాబిల్లి బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాదరణ చూసి వైసీపీలో వణుకు

జలుమూరు (సారవకోట): టీడీపీకి ప్రజల నుంచి వస్తు న్న ప్రజాదరణ ను చూసి వైసీపీ లో వణుకు పుట్టిం దని టీడీపీ మండ ల అధ్యక్షుడు కత్తిరి వెంకటరమణ అన్నారు. కిన్నెరవాడ గ్రామంలో శుక్రవారం బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు మట్ట గోవిందరావు, తర్ర సత్యం, చల్ల జనార్దనరావు తదితరులు పాల్గొన్నారు.



కిన్నెరవాడలో భవిష్యత్తుకు గ్యారెంటీ నిర్వహిస్తున్న కత్తిరి



వజ్రంపేటలో బాబు ష్యూరిటీ నిర్వహిస్తున్న టీడీపీ నాయకులు

మితిమీరిన వైసీపీ అరాచకాలు

నరసన్నపేట: రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వ అరాచకాలు మితిమీరాయని, వీటికి స్వస్తి చేప్పేందుకు రానున్న ఎన్నికల్లో జగన్‌కు చరమగీతం పాడాలని టీడీపీ నాయకులు అన్నారు. శుక్రవారం పట్టణ పరిధిలోని వజ్రంపేటలో బాబు ష్యూరిటీ భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. టీడీపీ అధినేత చంద్రబాబు వల్లే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని, టీడీపీ విజయానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. ఇంటింటికీ వెళ్లి టీడీపీ మేని ఫెస్టోను ప్రజలకు వివరించారు. కార్య క్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు కింజరాపు రామారావు, నాయకులు షేక్ మదీనా, వాన సూర్యనారా యణ, చలపాక మల్లేశ్వరరావు, గొండు గోపి తదితరులు పాల్గొన్నారు.

రేపు విద్యుత్ సరఫరాలో అంతరాయం

సంతబొమ్మాళి: మండలంలో ఆదివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని టెక్కలి ట్రాన్స్‌కో డీఈ శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. 33 కేవీ ఫీడర్‌పై మెయింటినెన్స్‌తో పాటు, కండ క్టర్లకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మల తొలగింపు కార్యక్రమం చేపడుతున్నామన్నారు. అందువల్ల ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నామని, వినియోగ దారులు గమనించి సహకరించాలని ఆయన కోరారు.

షర్మిల రాకతో శ్రేణుల్లో ఉత్సాహం

టెక్కలి: కాంగ్రెస్ పార్టీలోకి దివంగత ముఖ్యమంత్రి వైఎస్ఆర్ కుమార్తె షర్మిల చేరికతో పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం నెలకొందని, ఆమె రాకను స్వాగతిస్తున్నామని డీసీసీ అధ్య క్షుడు పేడాడ పరమేశ్వరరావు అన్నారు. శుక్రవారం నౌపడా ఆర్ఎస్ సమీపంలో పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ.. పీసీసీ అధ్యక్షుడు రుద్రరాజు నాయకత్వంలో పార్టీ పునర్నిర్మాణం జరిగి బలం పుంజుకుందన్నారు. ఉత్తరాంధ్ర ఇన్‌చార్జి రాకేష్‌రెడ్డి ఆధ్వర్యంలో పటిష్ఠమైందని, షర్మిల రాకతో మరింతగా ప్రజల మధ్యకు దూసుకుపోతుందని తెలిపారు. కార్యక్రమంలో కిసాన్ సెల్ అధ్యక్షుడు కోత మధు తదితరులు పాల్గొన్నారు. ● **జలుమూరు:** దివంగత ముఖ్యమంత్రి వైఎస్ఆర్ కుమార్తె షర్మిల కాంగ్రెస్‌లో చేరికతో నూతనోత్సాహం వచ్చి పార్టీ మరింత బలోపేతమైందని డీసీసీ కార్యవర్గ సభ్యుడు మామిడి సత్యనారాయణ అన్నారు. చల్లవానిపేటలో శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ.. షర్మిల రాకతో యువతతో పాటు అన్ని వర్గాల ప్రజలు కాంగ్రెస్ పార్టీ వైపు చూస్తున్నారన్నారు.

స్కిల్ హబ్స్‌ను సద్వినియోగం చేసుకోండి

నరసన్నపేట: నిరుద్యోగ యువత జిల్లాలో స్కిల్ హబ్స్‌ను సద్వినియోగం చేసుకుని వృత్తి నైపుణ్యాలను పెంపొందించుకోవాలని జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి వీబీ సాయి శ్రీనివాస్ కోరారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఉద్యోగ మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో ఒక్కో నియోజకవర్గ కేంద్రంలో స్కిల్ హబ్స్‌ను ఏర్పాటు చేశామని, వీటిని వివిధ అంశాల్లో శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సెట్‌శ్రీ సీఈవో ప్రసాదరావు, పోలాకి జడ్పీటీసీ ధర్మాన కృష్ణచైతన్య, జలుమూరు ఎంపీపీ వాన గోపి, కళాశాల ప్రిన్సిపాల్ డా.పి.లత, అధ్యాపకులు, నిరుద్యోగ యువతీ యువకులు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నేతకు ఎంపీ పరామర్శ



పరామర్శిస్తున్న ఎంపీ రామ్మోహన్

మెళియాపుట్టి: ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి విశ్రాంతి తీసుకుంటున్న టీడీపీ మండల అధ్యక్షుడు భాస్కర్‌గౌడ్‌ను ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడు శుక్రవారం రాజపురంలో పరామర్శించారు. ప్రమాదం జరిగిన తీరును అడిగి తెలుసుకున్నారు. ఆయతో పాటు టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కలమల సాగర్, నాయకులు బూర్లె లలిత శ్రీనివాస్, శ్రీను కందబల పైడిరాజ్, వసంత్, పరమేష్‌రెడ్డి, శ్రీధర్, అనురాధ గణపతి, కింజరాపు హరిప్రసాద్ తదితరులు ఉన్నారు.

పంచాయతీ ఖర్చుల వివరాలు తెలపాలి

మెళియాపుట్టి: గ్రామపంచాయతీ ఖర్చుల వివరాలు తెలియజేయాలని తెలుగుయువత మండల అధ్యక్షుడు బసవ పరమేష్‌రెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం మెళియాపుట్టిలో గ్రామ సభను నిర్వహించారు. పంచాయతీలో పారిశుధ్య పనులు సక్రమంగా జరగడం లేదని పలువురు నిలదీశారు. రాత్రి సమయాల్లో వీధి దీపాలు వెలగకపోవటంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని వాపోయారు. పంచాయతీకి వస్తున్న నిధులు ఏం చేస్తున్నారని పలువురు ప్రశ్నించారు. ప్రజలకు పంచాయతీ ఖర్చులు, రాబడులు తెలియ జేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని మహిళలు పేర్కొన్నారు. కార్యదర్శి చింతల అప్పారావు, సర్పంచ్ లక్ష్మి పాల్గొన్నారు.

ఎట్టకేలకు 'మార్గం' చూపారు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



రోడ్డు నిర్మాణానికి స్థలాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ సరోజిని

మెళియాపుట్టి, జనవరి 5: గొడ్డ-అంపురం రహదారి నిర్మాణానికి ఎట్టకేలకు మార్గం చూపారు. ఈనెల 3న 'ఆంధ్రజ్యోతి'లో 'సమస్య మళ్లీ మొదటికి' శీర్షికతో కథనం వచ్చిన సంగతి తెలిసిందే. దీనిపై గురు వారం రాత్రి ఎమ్మెల్యే రెడ్డి శాంతి వద్ద పంచాయితీ జరిగింది. శుక్రవారం తహ సీల్దార్ పి.సరోజిని అధ్వర్యంలో జిరాయితీ భూముల్లోంచి కాకుండా ప్రభుత్వ పోరం బోకు భూమిలో రోడ్డు వేసేందుకు కొలతలు వేశారు. త్వరితగతిన రోడ్డు నిర్మాణం చేపడ తామని ఆమె తెలిపారు. దీంతో పలు గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కార్యక్ర మంలో సర్పంచ్‌లు గొరేష్, జమ్మయ్య, కార్యదర్శులు తవిటినాయుడు, చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

అయోధ్య రాముని అక్షింతలు పంపిణీ

నందిగాం: మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం అయోధ్య నుంచి వచ్చిన శ్రీరాముని అక్షింతలు ఇంటింటికీ పంపిణీ చేశారు. పెద్దతామరాపల్లి, రౌతుపురం, దిమ్మిడిజోల తదితర గ్రామాల్లో నిర్వాహకులు ఎస్.లావన్న, ఎస్.దానయ్య, ఎస్.కృష్ణారావు తదితరుల నేతృత్వంలో అక్షింతలు ఊరేగించి ఇంటింటికి అందించారు. ● **కోటబొమ్మాళి:** అయోధ్య నుంచి వచ్చిన శ్రీరాముని అక్షింతలను కోటబొమ్మాళి నాయీ బ్రాహ్మణ వీధిలో ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు నౌగాపు నాగరాజు శుక్రవారం ఇంటింటికి వెళ్లి పంపిణీ చేశారు.

చిలకమ్మ పోరాటం స్ఫూర్తిదాయకం

మందస: శ్రీకాకుళం గిరిజన రైతాంగ సాయుధ పోరాటంలో సవర చిలకమ్మ వీరోచితంగా పోరాడి స్ఫూర్తిదాయకంగా నిలిచారని అఖిల భారత ఆదివాసీ వేదిక జాతీయ కమిటీ సభ్యురాలు జయలక్ష్మి అన్నారు. ఆదివాసీ వీరవనిత సవర చిలకమ్మ 28వ వర్ధంతిని కొండలోగాం గ్రామంలో శుక్రవారం నిర్వహించారు. బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి చిలకమ్మ నిరంతరం పోరాటం చేశారని, ఆమెను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సంఘాల నేతలు సన్నశెట్టి రాజశేఖర్, పి.కుసుమ, సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కమిటీ కార్యదర్శి తాండ్ర ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

వైసీపీకి మరో షాక్

● నేడు టీడీపీలోకి సంతబొమ్మాళి నేతలు

టెక్కలి, జనవరి 5: టెక్కలి నియోజకవర్గంలో అధికార వైసీపీకి మరో గట్టిషాక్ తగిలింది. సంతబొ మ్మాళి మండలంలో పట్టు ఉన్న పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు అట్టాడ రాం ప్రసాద్, యామాలపేట మాజీ సర్పంచ్ ఆరంగి మధు, భావనపాడు నుంచి మరికొందరు మత్స్యకార నాయకులు అధికార వైసీపీని వదిలి టీడీపీ తీర్థం పుచ్చుకోనున్నారు. దీంతో వైసీపీలో గుబులు నెలకొంది. ఇప్పటికే వైసీపీ ముఖ్య నేతలంతా పార్టీని వదలొద్దని వారిని బతిమలాడినా టీడీపీలోకి చేరుతామని స్పష్టం చేయడంతో వైసీపీ నేతల ప్రయత్నాలు బెడిసికొట్టాయి. ఇప్పటికే నందిగాం మండ లంలో కాపుతెంబూరు, పెద్దలవునిపల్లి, బోరుభద్ర, ఉయ్యాల పేట పంచాయతీల పరిధి నుంచి వందల కుటుంబాలు వైసీపీ నుంచి టీడీపీలోకి చేరడంతో ఖంగుతిన్న వైసీపీ నాయకులు తాజాగా సంతబొమ్మాళి మండలంలో మర్రి పాడు, భావన పాడు, యామాల పేట పంచాయతీల నుంచి వందల కుటుంబాలు టీడీపీలో చేరుతుండడంతో జీర్ణించు కోలేక పోతున్నారు. టీడీపీలో చేరికల కార్యక్రమం శనివారం మధ్యాహ్నం నిర్వహించనున్నారు. టెక్కలి నుంచి కార్యకర్తల వాహన శ్రేణులతో నర్సిపురం, దిమిలాడ, బూరగాం, చిన్న మర్రి పాడు వరకు నిర్వహిస్తున్న ర్యాలీలో టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్యే కింజరాపు అచ్చెన్నాయుడు, ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడు పాల్గొని పార్టీలోకి వారిని ఆహ్వానించనున్నారు. దీంతో సంతబొమ్మాళి మండలంలో వైసీపీకి గట్టి షాక్ తగిలి నట్లయ్యింది.

పీఎం కిసాన్ కార్డులను సద్వినియోగం చేసుకోండి



మాట్లాడుతున్న ఏడీ చంద్రశేఖర్

పలాసరూరల్/పలాస: పీఎం కిసాన్ కార్డులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని పశు సంవర్ధక శాఖ పలాస ఏరియా ఏడీ డా.పి.చంద్రశేఖర్ అన్నారు. పలాస పట్టణంతో పాటు బొడ్డపాడు గ్రామంలో శుక్రవారం పాడి రైతులతో మాట్లాడారు. పశువులు కలిగి 1బి, అడంగల్ ఉన్న రైతులకు పీఎంకిసాన్‌కు దరఖాస్తు చేసుకోవాలన్నారు. పశువుల కొనుగోలు, పాడి పరిశ్రమకు అవసరమైన సామగ్రి కోసం రుణాలను తక్కువ వడ్డీ రేటుకు అందజేస్తున్నట్లు తెలిపారు. పశువులకు ఫుట్ అండ్ మౌత్ వ్యాధి టీకాలను ఈనెల 31వతేదీ వరకు వేయనున్నట్లు తెలిపారు. దీనిని రైతులు సద్వినియోగం చేసుకోవాల న్నారు. కార్యక్రమంలో ఎల్ఎస్ఏ పి.లక్ష్మి, ఏహెచ్ఏలు మహేష్,వాసు, ఓఎస్‌లు అనూష, నారాయణ, రైతులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలను నిలుపుదల చేయాలి

నరసన్నపేట: పట్టణం శివనగర్ కాలనీలో జోగిచెరువు గర్భంలో చేపట్టిన అక్రమ నిర్మాణాలను తక్షణం నిలుపుదల చేయాలని పంచాయతీ ఈవో సవర చిన్నారావు స్పష్టం చేశారు. శుక్రవారం జోగి చెరువు గర్భంలో అక్రమ నిర్మాణాలను పరిశీలించారు. ప్రభుత్వ నిబంధనల మేరకు చెరువు గర్భంలో ఎటువంటి నిర్మాణాలను చేపట్టకూడదన్నారు. పట్టా ఉన్నంతవరకే సంబంధిత స్థలంలో నిర్మాణాలు చేపట్టాలన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

రైల్వేశాఖలో ఓబీసీలకు తగిన ప్రాధాన్యం ఇవ్వాలి

● పలాస రైల్వే ఉద్యోగుల సంఘం నేతలు



భువనేశ్వర్‌లో పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీని కలిసిన రైల్వే ఓబీసీ నాయకులు

పలాస, జనవరి 5: రైల్వే శాఖలో ఓబీసీలకు తగిన ప్రాధాన్యం ఇవ్వాలని ఆ సంఘ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఈస్ట్ కోస్ట్ రైల్వే భువనేశ్వర్ రైలు నిలయంలో ఓబీసీ పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ చైర్మన్ రాజేశ్‌వర్మతో పాటు 30 ఎంపీలతో కూడిన కమిటీ శుక్రవారం సమావేశమైంది. ఓబీసీలకు పార్లమెంట్ చట్టసభల ద్వారా లభించిన సంక్షేమ పథకాలు రైల్వే యాజమాన్యం ఉద్యోగులకు సక్రమంగా అమలు చేయాలని ఆ సంఘ నాయకులు కమిటీని కోరారు. ఓబీసీ కార్మికుల పట్ల కక్షసాధింపు చర్యలు ఆపాలని, ఖాళీగా ఉన్న పోస్టులను తక్షణం భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆలిండియా ఓబీసీ రైల్వే ఉద్యోగుల సంఘం జోనల్ అధ్యక్షుడు పి. రాజశేఖర్, అధ్యక్షుడు ఎస్.రామచంద్రరావు, టీకే సాహు, ప్రధాన కార్యదర్శి శివప్రసాద్‌సాహు, బ్రాంచ్ కార్యదర్శి జీఎల్‌కే రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రూ.68.50 లక్షలకు సంత వేలం ఖరారు

కోటబొమ్మాళి: నారాయణవలస గురువారం సంత వేలంపాటను అనకాపల్లి జిల్లా, దేవరాపల్లికి చెందిన రొంగలి సింహాచలం రూ.68.50 లక్షలకు సొంతం చేసుకున్నారు. ఈ ఏడాది ఏప్రిల్ నుంచి వచ్చే ఏడాది ఏప్రిల్ 30 వరకు సంతలో ఆశీలు వసూలుకు సంబంధించిన వేలం పాటను శుక్రవారం ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో కె.ఫణీంద్రకుమార్ నిర్వహించారు. ఈ వేలం పాటలో తర్ర గణపతి, సింహా చలం పాల్గొనగా అధికారులు సర్కారు పాటగా రూ.67.50 లక్షలకు ప్రారంభించగా సింహాచలం రూ.68.50 లక్షలకు కైవసం చేసుకున్నారు.

కార్మిక చైతన్య యాత్రను జయప్రదం చేయండి

టెక్కలి: టీడీపీ అనుబంధ సంస్థ తెలుగునాడు ట్రేడ్ యూనియన్ కౌన్సిల్ (టీఎన్‌టీయూసీ) ఆధ్వర్యంలో శనివారం మధ్యాహ్నం 2 గంటలకు ప్రారంభించనున్న చంద్రన్న కార్మిక చైతన్యయాత్రను విజయవంతం చేయాలని టీడీపీ మండల అధ్యక్షుడు బగాది శేషగిరి కోరారు. దీనికి సంబంధించిన పోస్టర్లను శుక్రవారం పార్టీ కార్యాలయంలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్యే కింజరాపు అచ్చెన్నాయుడు, ఎంపీ కింజరాపు రామ్మోహన్‌నాయుడు పాల్గొంటారని, పార్టీ క్యాడర్ పాల్గొనాలని కోరారు. టీడీపీ నేతలు మళ్ల బాలకృష్ణ, కోళ్ల లవకుమార్, దారపు రాము, టీఎన్‌టీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మల్లికార్జునరావు, జి.నర్సింగరావు పాల్గొన్నారు.

రేపు చెకుముకి జిల్లా స్థాయి సైన్స్ సంబరాలు

టెక్కలి రూరల్: చెకుముకి జిల్లాస్థాయి సైన్స్ సంబరాలు ఆదివారం శ్రీకాకుళం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్నట్లు జన విజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కుప్పిలి కామేశ్వరరావు, గొంటి గిరిధర్ ఒక ప్రకటనలో తెలిపారు. మండలస్థాయి పరీక్షల్లో ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచిన ప్రభుత్వ, ప్రైవేట్ విద్యార్థులు జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొనాలని కోరారు.

నేడు మండల సమావేశం

పలాసరూరల్: మండల పరిషత్ కార్యాలయంలో శనివారం మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ ఉంగ ప్రవీణ అధ్యక్షతన నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో ఎస్.రమేష్‌నాయుడు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సర్పంచ్‌లు, ప్రజాప్రతినిధులు, ఎంపీటీసీ సభ్యులు కోరారు. వివిధ శాఖల అధికారులు పూర్తి సమాచారంతో రావాలని ఆయన సూచించారు.

డీసీసీబీ భూములు వేలానికి చర్యలు

జలుమూరు: జలుమూరు రెవెన్యూ పరిధిలో డీసీసీబీ అధీనంలో ఉన్న 16 ఎకరాలు భూములు వేలం వేసేందుకు చర్యలు చేపడుతున్నట్లు సీఈవో వరప్రసాదరావు తెలిపారు. చల్లవానిపేట కూడలిలోని బ్యాంకును శుక్రవారం తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సదరు భూ ముల్లో కొన్ని న్యాయపరమైన చిక్కులున్నందున 5 ఎకరాలు విడిచిపెట్టి ఎటువంటి సమస్యలు లేని 16 ఎకరాలు భూములు వచ్చే నెలలో వేలం వేసేందుకు ప్రణాళిక రూపొందించామన్నారు. జీఎం శిమ్మ జగదీష్, బ్యాంకు మేనేజరు డీవీ రమణ పాల్గొన్నారు.

పింఛన్లు పంపిణీ

పలాస: కొత్తగా మంజూరైన వితంతు, వృద్ధాప్య, దివ్యాంగుల పింఛన్లను మంత్రి సీదిరి అప్పలరాజు శుక్రవారం పురుషోత్తపురం కాలనీవద్దలో పంపిణీ చేశారు. కార్యక్రమంలో మునిసిపల్ చైర్మన్ బళ్ల గిరిబాబు, వైస్‌చైర్మన్లు మీసాల సురేష్‌బాబు, బోర కృష్ణారావు, కమిషనర్ టి.నాగేంద్రకుమార్, సిబ్బంది, పలువురు కౌన్సిలర్లు పాల్గొన్నారు. ● **ఎల్.ఎన్.పేట:** ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలను పారదర్శకంగా అర్హులందరికీ రాజకీయాలకు అతీతంగా ప్రభుత్వం అందజేస్తోందని ఎమ్మెల్యే రెడ్డి శాంతి అన్నారు. శుక్రవారం ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో పెంచిన పింఛన్లను లబ్ధి దారులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ రాఘవేంద్ర మీనా, ఎంపీడీవో ఆర్.కాశీప్రసాదరావు, తహసీల్దార్ ఆర్.అప్పలరాజు, ఎంపీపీ ఆర్.జ్యోతిలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.


ఇచ్ఛాపురం: నినాదాలు చేస్తున్న అంగన్‌వాడీలు


గార: ఎంపీడీవో కార్యాలయ ప్రాంగణంలో నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీ కార్యకర్తలు, సిబ్బంది

25 రోజులుగా..

● కొనసాగుతున్న అంగన్‌వాడీలు నిరసన ● స్పందించని యంత్రాంగం

తమ సమస్యల పరిష్కారం కోరుతూ అంగన్‌వాడీ సిబ్బంది, కార్యకర్తలు చేపట్టిన నిరసన శుక్రవారం నాటికి 25వ రోజుకు చేరింది. జిల్లా వ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపడుతున్నారు. వివిధ రూపాల్లో ఆందోళన చేస్తున్నా యంత్రాంగం స్పందించకపోవడంపై వారంతా మండిపడుతున్నారు. కొన్నిచోట్ల వివిధ రాజకీయ పార్టీల నాయకులు సంఘీభావం తెలిపారు. తమ సమస్యలు పరిష్కరించే వరకు పోరాటం కొనసాగిస్తామని హెచ్చరించారు. - ఆంధ్రజ్యోతి బృందం


నరసన్నపేట: వీఎన్‌పురంలో తెరిచిన అంగన్‌వాడీ కేంద్రానికి తాళాలు వేస్తున్న కార్యకర్తలు


ఆమదాలవలస: నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీ సిబ్బంది


కోటబొమ్మాళి: ప్రాజెక్టు కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీ సిబ్బంది


జలుమూరు: సారవకోటలో ధర్నా చేస్తున్న అంగన్‌వాడీలు


పాతపట్నం: నినాదాలు చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

8న సర్వసభ్య సమావేశం

కంచిలి: మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ దేవదాస్ రెడ్డి అధ్యక్షతన ఈ నెల 8వ తేదీ సోమవారం నిర్వహించనున్నట్టు ఎంపీడీవో ఎం.ఈశ్వరరావు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సమావేశానికి అన్ని శాఖల అధికారులు పూర్తి సమాచారంతో హాజరు కావాలని, ప్రజా ప్రతినిధులు రావాలని కోరారు.

బీసీల సంక్షేమానికి కృషి

అరసవల్లి: బీసీల సంక్షేమంపై ప్రత్యేక దృష్టి సారిస్తానని ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడు అన్నారు. శుక్రవారం ఆయన తన నివాసంలో ఆ సంఘ ప్రనిధుల ఆధ్వర్యంలో బీసీల కుల డైరీని ఆవిష్కరించారు. తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చాక బీసీల సంక్షేమానికి, రక్షణకు సమగ్ర చట్టాన్ని తీసుకు వచ్చేందుకు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఎన్ని సూర్యారావు, జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు పిట్ట చంద్రపతిరావు, అలీ బేగ్, బీవీ రమణ, బీసీ న్యాయవాదుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు ఆగూరు ఉమామహేశ్వరరావు, చౌదరి లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

రూ.3.12 కోట్లు లబ్ధి

కలెక్టరేట్: అర్హత ఉండీ సాంకేతిక కారణాలతో సంక్షేమ పథకం వర్తించనివారికి సీఎం శుక్రవారం తన క్యాంపు కార్యాలయం నుంచి బటన్ నొక్కి లబ్ధిదారుల ఖాతాల్లో నగదు జమచేశారు. జిల్లాలో ఈ పథకం ద్వారా 2,143 మందికి రూ.3.12కోట్లు లబ్ధ చేకూరుతుందని కలెక్టర్ శ్రీకేష్ బి.లఠ్కర్ తెలిపారు. కలెక్టరేట్‌లో వర్చువల్ విధానంలో జరిగిన ఈ కార్యక్రమంలో నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్, పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి, జడ్పీ చైర్మన్ పిరియ విజయ, సుడా చైర్మన్ కోరాడ ఆశాలత, డీఆర్‌డీఏ పీడీ విద్యాసాగర్, బీసీ కార్పొరేషన్ ఈడీ గడ్డెమ్మ, సచివాలయాల నోడల్ అధికారి వాసుదేవరావు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా లబ్ధిదారులకు నమూనా చెక్కును అందజేశారు.

పాఠశాల ఆకస్మిక తనిఖీ

కోటబొమ్మాళి: చిన్నహరిశ్చంద్రపురం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను శుక్రవారం ఎంఈవోలు ఎస్.అప్పలరాజు, ఎల్వీ ప్రతాప్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల రికార్డులు, మధ్యాహ్న భోజన పథకం అమలు తీరును పరిశీలించారు. విద్యార్థుల విద్యా ప్రగతిని పరిశీలించారు. మెనూ ప్రకారం ఆహార పదార్థాలు వండి పెట్టాలని సూచించారు. శుచిగా, పరిశుభ్ర వాతావరణంలో విద్యార్థులకు భోజనం పెట్టాలన్నారు.

అవగాహన అవసరం

కోటబొమ్మాళి: శీతాకాలం ప్రభావంతో పశువులకు గాలికుంటు వ్యాధి సోకే అవకాశం ఉండడంతో పాడిరైతులు అవగాహన కలిగి ఉండి తగు జాగ్రత్తలు తీసుకోవాలని పశువైద్యాధికారులు లఖినేని కిరణ్ కుమార్, ఎం.ప్రజ్ఞ చైతన్య అన్నారు. వీరరాఘవపురం, పొన్నాన పేట, హరిశ్చంద్రపురం, చిట్టివలస, జియ్యన్నపేట, గవరంపేట గ్రామాల్లో శుక్రవారం 589 పశువలకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. నాలుగు మాసాల దూడల నుంచి అన్ని వయసుల పశువులకు వేసుకోవచ్చన్నారు. మూడు మాసాల లోపల దూడలకి, అనారోగ్యంతో ఉన్న పశువులకు, చూడి పశువులకు ఈ టీకాలు వేయ రాద్దన్నారు. పశువైద్య సిబ్బంది. కె.ముకుందరావు పాల్గొన్నారు.

భూ సమస్యలు పరిష్కరించుకోండి

పలాసరూరల్: గ్రామాల్లో ఉన్న భూ సమస్యలను రీ సర్వే ద్వారా పరిష్కరించుకోవాలని తహసీల్దార్ ఎల్.మధుసూదనరావు అన్నారు. బంటుకొత్తూరు, పండాశాసనం గ్రామాల్లో శుక్రవారం గ్రామసభ నిర్వ హించారు. కార్యక్రమంలో వీఆర్వోలు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

రీ సర్వేతో మేలు

జి.సిగడాం: భూ రీసర్వేతో భూ సమస్యలను పరిష్కరించనున్నట్టు తహసీల్దార్ పప్పల వేణుగోపాలరావు అన్నారు. శుక్రవారం శేతుభీమవరం పంచాయతీ గంగన్న దొరపాలెంలో భూ రీసర్వేపై గ్రామసభ నిర్వహించారు. సమావేశంలో సర్పంచ్ తొత్తడి రామారావు, ఆర్‌ఐ రామచంద్రరావు, సర్వేయర్ క్రిష్ణారావు, వీఆర్వో రైతులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో షర్మిల చేరికపై హర్షం

ఆమదాలవలస: తెలంగాణ వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీ అధినేత షర్మిల జాతీయ కాంగ్రెస్ పార్టీలో చేరడం హర్షనీయమని పీసీసీ ప్రధాన కార్యదర్శి సనపల అన్నాజీరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటికే ఎంతో ఉత్తేజంతో పరుగులు తీస్తున్న రాష్ట్ర కాంగ్రెస్‌లో షర్మిల రాక మరింత ఉత్సాహం నింపుతుందన్నారు. షర్మల రాకతో వచ్చే ఎన్నికల్లో పార్టీ పుంజుకుంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

పాఠశాల అభివృద్ధికి సాయం

కంచిలి: డోలగోవిందపురం జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల అభివృద్ధికి సహకరిస్తూ ఆ మండలానికి చెందిన టీడీపీ నాయకులు బి.కామేష్ రెడ్డి శుక్రవారం హెచ్‌ఎంకు రూ.10 వేలు ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధాయ సిబ్బంది పాల్గొన్నారు.

జాగ్రత్త తీసుకోవాలి

పాతపట్నం: అంటురోగాలు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని గంగువాడ పీహెచ్‌సీ వైద్యాధి కారి శివ అన్నారు. తిడ్డివి గ్రామ పంచాయతీలో శుక్రవారం వైద్య శిబిరం నిర్వహించారు. డా.పూర్ణిమ వైద్య సేవలు అందించారు.

బస్సుయాత్ర విజయవంతం చేయండి


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న గొండు శంకర్, తదితరులు

అరసవల్లి: స్థానిక విశాఖ-ఎ కాలనీలో గల పార్టీ కార్యాలయంలో శుక్రవారం టీడీపీ సీనియర్ నాయకుడు, ఉమ్మడి జిల్లా సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు గొండు శంకర్, టీఎన్‌టీయూసీ అధ్యక్షుడు జి.నారాయణ, డొండపాటి నవీన్‌కుమార్‌తో కలిసి కార్మిక చైతన్య బస్సుయాత్ర పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో టీఎన్‌ఎస్‌ఎఫ్ నియోజకవర్గ అధ్యక్షుడు రెడ్డి శంకర్, గార మండల పార్టీ అధ్యక్షుడు గొండు వెంకట రమణమూర్తి, బైరి మాజీ సర్పంచ్ ఎందు చిన్నారావు, రూరల్ మండల తెలుగు యువత అధ్యక్షుడు గురువు లక్ష్మణ, నీలంశెట్టి తమ్మయ్య, అల్లు రమేష్ పాల్గొన్నారు.

ఆదిత్యుని సన్నిధిలో ఎన్జీవో నేతలు


ఎన్జీవో నాయకులకు జ్ఞాపికను అందిస్తున్న ఆలయ ఈవో

అరసవల్లి: ఆరోగ్యప్రదాత అరసవల్లి సూర్యనారాయణ స్వామివారిని శుక్రవారం ఏపీఎన్జీవో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు, జేఏసీ చైర్మన్ బండి శ్రీనివాసరావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేవీవీ శివారెడ్డి దర్శించుకున్నారు. వారికి ఆలయ ప్రధాన అర్చకులు స్వాగతం పలుకగా అర్చకులు వేదమంత్రాలతో ఆశీర్వదించారు. స్వామివారి జ్ఞాపికను ఆలయ ఈవో హరిసూర్యప్రకాష్ వారికి అందజేశారు. కార్యక్రమంలో ఎన్జీవో నేతలు చౌదరి పురుషోత్తంనాయుడు, డీవీ రమణ, హనుమంతు సాయిరాం, మురళీ, విజయనగరం జిల్లా అధ్యక్షుడు రవిశంకర్, విశాఖ జిల్లా కార్యదర్శి, ఎ.రమేష్, చల్లా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

సచివాలయాలతో ప్రజల చెంతకు సేవలు

శ్రీకాకుళం క్రైం: గ్రామ సచివాలయాల ద్వారా ప్రజల చెంతకే ప్రభుత్వ సేవలు తీసుకొచ్చిన ఘనత సీఎం జగన్‌దేనని మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. శుక్రవారం రూరల్ మండలం రాగోలులో నూతనంగా నిర్మించిన సచివాలయ భవనాన్ని ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో తహసీల్దార్ వెంకట్రావు, తదితరులు పాల్గొన్నారు.

కుందువానిపేటలో పోలీసుల 'పల్లెనిద్ర'



నిద్రిస్తున్న ఎస్‌ఐ విజయకుమార్

శ్రీకాకుళం క్రైం: రానున్న ఎన్నికల నేపథ్యంలో సమస్యాత్మక ప్రాంతమైన రూరల్ మండలంలోని కుందువానిపేట గ్రామంలో పోలీసులు పల్లె నిద్ర కార్యక్రమం నిర్వహించారు. గ్రామ పాఠశాలలో గురువారం అర్ధరాత్రి నుంచి శుక్రవారం ఉదయం వరకు ఎస్‌ఐ విజయ కుమార్ బస చేశారు. దీనికి ముందు నిర్వహించిన అవగాహన సదస్సులో శ్రీకాకుళం డీఎస్పీ వై.శృతి, ట్రైనీ డీఎస్పీ చప్పిడి రాజా, శ్రీకాకుళం సీఐ ఆర్.సన్యాసినాయుడు, ఎస్‌ఐ విజయకుమార్ మాట్లాడారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించుకోవాలని, ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు తావ్వికూడదని సూచించారు. గతంలో ఈ ప్రాంతంలో రెండు పార్టీల వెంట వెళ్లి ప్రజలు కొట్లాటకు దిగారని, అటువం టివి పునరావృతం కాకుండా గ్రామ పెద్దలు చొరవ చూపాలని కోరారు.

సత్యనారాయణ త్యాగం సజీవం

శ్రీకాకుళం క్రైం: తెలుగు రాష్ట్రాల్లో ప్రముఖ ఆర్థోపెడిక్ వైద్యుడు ఏవీ గురవారెడ్డి తండ్రి డాక్టర్ అన్నపరెడ్డి సత్యనారాయణ గురువారం హైదరాబాద్‌లో హార్ట్ ఎటాక్‌తో మృతి చెందారు. ఆయన మృతదేహాన్ని కుటుంబ సభ్యులు రాగోలు జెమ్స్ మెడికల్ కళాశాలకు అందించారు. శుక్రవారం కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు సత్యనారాయణ మృతదేహంపై పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. వైద్య విద్యార్థుల శిక్షణకు సత్యనారాయణ మృతదేహాన్ని అప్పగించిన కుటుంబ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. సత్యనారాయణ త్యాగం సజీవమని పేర్కొన్నారు. సూపరింటెండెంట్ అశోక్‌రెడ్డి, అడిషనల్ సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాసులు, అధ్యాపకులు రవి తేజ, ఆర్‌ఎంవో బాలమురళి, ప్రవీణ్, ఆపరేషన్ మేనేజర్ జ్యోత్స్న పాల్గొన్నారు.

ఇంటింటికీ అయోధ్య రాముడి పూజిత అక్షింతలు


అక్షింతాలు పంపిణీ చేస్తున్న దృశ్యం

రణస్థలం: మండలంలోని ఇంటింటికి అయోధ్య రాముడి పూజిత అక్షింతలు పంపిణీ చేసే కార్యక్రమం రామ భక్తులు చేపట్టారు. ఇందులో భాగంగా శుక్రవారం మండల కేంద్రలోని షిర్డీ బాబా ఆలయం వద్ద పూజలు చేసి, జేఆర్ పురం పంచాయతీ పరిధిలో రామ భక్తులు బలివాడా శ్రీనివాసరావు, టేకు బ్రహ్మాజీ, భూషన్ ఇంటికికీ తిరగి అయోధ్య అక్షింతలు పంపిణీ చేశారు. మండలంలోని అన్ని పంచాయతీలకు అయోధ్య అక్షింతలు అందిస్తామన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

సంతబొమ్మాళి: మండలంలోని వడ్డితాండ్రలో పేకాట శిబిరంపై శుక్రవారం దాడి చేసి ఐదుగురు పేకాట రాయుళ్లను అరెస్ట్ చేసినట్లు నౌపడ ఎస్‌ఐ కిషోర్‌వర్మ తెలిపారు. వారి నుంచి రూ.3,400 స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని చెప్పారు.

సభను విజయవంతం చేయండి


సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

రణస్థలం: వైసీపీ అవలంభిస్తున్న బీసీ వ్యతిరేక విధానాలను నిలదీస్తూ విశాఖలో ఈనెల 7న బీజేపీ నిర్వహించనున్న బీసీ సామాజిక చైతన్య సభను విజయవంతం చేయాలని ఆ పార్టీ ఎచ్చెర్ల నియోజకవర్గ ఇన్‌చార్జి నడుకుదిటి రజని అన్నారు. శుక్రవారం ఎన్‌ఈఆర్ క్యాంపు కార్యలయంలో ఆమె మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి జగన్ పాదయాత్ర సమయంలో వైసీపీ మెనిఫెస్టోలో ఇచ్చిన హామీలు తుంగలో తొక్కరని ఆరోపించారు. 56 బీసీ కుల కార్పొరేషనలకు నిధులివ్వకుండా అవమానించారని, అధికారాలు లేని బీసీ కమిషన్ ఏర్పాటు చేశారని, మోసపూరిత వైసీపీ ప్రభుత్వాన్ని గద్దెదించాలన్నారు. కార్యక్రమంలో మీసాల హేమలరావు, మజ్జి నాగరాజు, ఇనపర్తి ఆదియ్య, వెలిచేటి ప్రసాద్ పాల్గొన్నారు.

పథకాలపై అవగాహన

జి.సిగడాం: భారత్ వికసిత్ సంకల్ప యాత్రలో భాగంగా కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై శనివారం నుంచి ప్రజలకు అవగాహన కల్పించనున్నట్టు బీజేపీ మండల అధ్యక్షుడు, విశ్వకర్మ యోజన నియోజకవర్గ కో-ఆర్డినేటర్ వజ్జపర్తి రఘురాం తెలిపారు. ఈ విషయమై శుక్రవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఈవోపీఆర్డీ ఎస్.శ్రీనివాసులుకు కార్యక్రమ షెడ్యూల్‌ను అందజేశారు. కిసాన్‌మోర్చా రాష్ట్ర సెల్ కన్వీనర్ తమ్మినేని గోవిందరావు, నియోజకవర్గ కో-కన్వీనర్ సంపత్‌రావు, ఏపీవో సీహెచ్ సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

నేడు 'డయల్ యువర్ వర్సిటీ'

ఎచ్చెర్ల: డాక్టర్ బీఆర్ అంబేద్కర్ యూనివర్సిటీలో శనివారం డయల్ యువర్ వర్సిటీ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు ఇన్‌చార్జి రిజిస్ట్రార్ బిడ్డిక అడ్డయ్య శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. శనివారం ఉదయం 10 నుంచి 11 గంటల వరకు ఫోన్ ఇన్ లైవ్‌లో ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. అకడమిక్ అంశాలు, సందేహాల నివృత్తికి విద్యార్థులు, తల్లిదండ్రులు 82478 61919 నెంబరుకు ఫోన్ చేయాలన్నారు.

మౌలిక వసతుల కల్పనపై దృష్టి


విద్యార్థులతో కలసి భోజనం చేస్తున్న డైరెక్టర్ బాలాజీ

ఎచ్చెర్ల: మౌలిక వసతుల కల్పనపై దృష్టిసారించినట్టు ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ కేవీజీడీ బాలాజీ అన్నారు. శుక్రవారం ఆయన విద్యార్థులతో కలసి భోజనం చేశారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించడలో రాజీపడొద్దని నిర్వాహకులు సూచించారు. ఆహారం తయారీకి వాడే పదార్థాలను పరిశీలించారు. విద్యార్థులతో సమావేశమై పలు విషయాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఏవో ముని రామకృష్ణ, మెస్ కోఆర్డినేటర్లు తదితరులు పాల్గొన్నారు.

సంతోషిమాతకు పూజ



ఇచ్ఛాపురం రూరల్: కేశపురంలో 31 మంది మహిళలు సంతోషిమాతను గ్రామంలో ప్రతిష్ఠింపచేసి 21 శుక్రవారాలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. శుక్రవారం ప్రత్యేక పూజలు చేసి మధ్యాహ్నం అమ్మ ప్రతిరూపమైన గజముద్దలను మేళతాళాలతో ఊరేగించి, నదిలో నిమజ్జనం చేశారు.

ధ్యానంతో మానసిక ప్రశాంతత


రవికుమార్‌ను సన్మానిస్తున్న దృశ్యం

ఆమదాలవలస: మానవ దయనందన జీవి తంలో కొద్ది సమయం దైవ ధ్యానంతో గడిపితే మానసిక ప్రశాంతత లభిస్తుందని టీడీపీ జిల్లా అధ్యక్షుడు కూన రవికుమార్ అన్నారు. గాజులకొల్లివలస పంచా యతీ శ్రీహరిపురంలో నిర్వహించిన సీతారాముల విగ్రహ ప్రతిష్ఠలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా రవికుమార్‌ను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో చింతాడ లక్ష్మణరావు, పి.శ్రీనివాసరావు, ఎర్రయ్య పాల్గొన్నారు.

జిల్లాలో కొత్తగా 4,958 రేషన్ కార్డులు

కలెక్టరేట్: జిల్లాలో కొత్తగా 4,958 కార్డులు మంజూరైనట్టు జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్ తెలిపారు. ప్రస్తుతం జిల్లాలో ఉన్న 6,70,325 కార్డుదారులకు ప్రతీ నెలా బియ్యం, నిత్యావసర సరకులను పంపిణీ చేస్తున్నట్టు తెలిపారు. ద్వైవార్షిక పథకంలో భాగంగా అర్హులై ఉండి, గతేడాది ఆగస్టు నుంచి డిసెంబరు మధ్య కొత్త రైస్‌కార్డు, కార్డు విభజన కొరకు దరఖాస్తు చేసుకున్న అర్హులైన వారందరికీ మంజూరు చేసినట్టు తెలిపారు. కొత్త కార్డుదారులకు జనవరి 1నుంచే బియ్యం, ఇతర నిత్యావసరాలను పంపిణీ చేస్తున్నట్టు స్పష్టం చేశారు.

సాఫ్ట్‌బాల్ పోటీలకు నలుగురు ఎంపిక


క్రీడాకారులతో డీఈవో వెంకటేశ్వరరావు తదితరులు

శ్రీకాకుళం స్పోర్ట్స్: జాతీయస్థాయి సాఫ్ట్ బాల్ పోటీలకు జిల్లా నుంచి నలుగురు క్రీడాకారులు ఎంపికైనట్టు డీఈవో కె.వెంకటేశ్వరరావు తెలిపారు. అండర్-17 బాలబాలికల విభాగంలో అనంతపురంలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో పి.రేణుక, ఎం.యశ్వంత్, ఎస్.మధుసూధనరావు (కేశవరావుపేట), వై.లక్ష్మీప్రసాద్ (శ్రీకాకుళం) ప్రతిభ చూపారు. దీంతో ఈ నెల 9 నుంచి 13వ తేదీ వరకు రాజస్థాన్‌లోని బిటిమిన్‌లో జరగనున్న జాతీయస్థాయి పోటీల్లో వారు పాల్గొంటారన్నారు. వీరిని జిల్లా వ్యాయామ ఉపాధ్యాయ సంఘం అధ్యక్షులు ఎంవీ రమణ, కార్యదర్శి ఎం.సాంబమూర్తి, ఎస్‌జీఎఫ్ కార్యదర్శి బీవీ రమణ, పి.సుందరరావు, కె.మాధవరావు, మెట్ట తిరుపతి, డి.పెంటయ్య, జి.మల్లేసు తదితరులు అభినందించారు.

క్రీడాకారులకు ఆర్మీ ర్యాలీ

శ్రీకాకుళం స్పోర్ట్స్: క్రీడాకారులకు ఆర్మీ ర్యాలీ నిర్వహించు నున్న ట్టు జిల్లా క్రీడాభివృద్ధి అధికారి కె.శ్రీధర్ తెలిపారు. రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ ఆదేశాల మేరకు ఆర్మీ బాయ్స్ స్పోర్ట్స్ కంపెనీ, మద్రాస్, ఇంజినీరింగ్ గ్రూప్ సెంటర్ బెంగుళూరుల్లో గల బాక్సింగ్, స్విమ్మింగ్, హాకీ, సెయిలింగ్ క్రీడావిభాగాల్లో ఉత్తమ క్రీడాకారుల ఎంపికలు ఈ నెల 5 నుంచి 8వ తేదీ వరకు జరుగుతాయని, ఇందులో 8 నుంచి 16 ఏళ్ల మధ్య వయస్సు గల వారు అర్హులన్నారు. వీరంతా అంతర్జాతీయ స్థాయి పోటీల్లో పతకాలు సాధించిన వారు తమ మెరిట్ ధ్రువ పత్రాలతో కేం ద్రీయ విద్యాలయం ఏఈజీ సెంటర్, స్పోర్ట్స్ గ్రౌండ్ బెంగుళూరు వద్ద నిర్వహించే ర్యాలీలో పాల్గొనాలన్నారు.

అర్హులందరికీ పింఛన్లు

ఇచ్ఛాపురం: అర్హులైన అందరికీ పింఛన్ల అందించిన ఏకైక ప్రభుత్వం వైసీపీ అని ఎమ్మెల్సీ నర్తు రామారావు అన్నారు. శుక్రవారం మున్సిపల్ కార్యాలయ ఆవరణలో మున్సిపల్ చైర్‌పర్సన్ పిలక రాజ్యలక్ష్మి ఆధ్వర్యంలో పింఛన్ల పంపిణీ నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్లు ఉలాల భారతీదివ్య, లాబాల స్వర్ణమణి తదితరులు పాల్గొన్నారు.

మునిసిపల్ కార్మికులను పర్మినెంట్ చేయాలి

అరసవల్లి: మునిసిపల్ కార్మికులను పర్మినెంట్ చేయాలని ఆ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మునిసిపల్ కార్మిక సంఘాల జేఏసీ రాష్ట్ర కన్వీనర్ సుబ్బారాయుడు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక మునిసిపల్ కార్యాలయం వద్ద ఏఐటీయూసీ ఆధ్వర్యంలో మునిసిపల్ కార్మికులు చేపట్టిన సమ్మెలో ఆయన పాల్గొని మాట్లాడారు. డిమాండ్లు నెరవేర్చే వరకూ సమ్మెను కొనసాగిస్తామన్నారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. వీరి శిబిరాన్ని టీడీపీ మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి సందర్శించి మద్దతు తెలిపారు.


అరవసల్లి: మునిసిపల్ కార్మికులకు మద్దతు తెలుపుతున్న మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి


కాశీబుగ్గ: సంఘీభావం తెలుపుతున్న టీడీపీ నేతలు

వినూత్నంగా నిరసన..

ఆమదాలవలస: పట్టణంలోని ప్రధాన రహదారి ఆనుకొని గత 11 రోజులుగా నిరవధిక సమ్మె చేస్తున్న మునిసిపల్ పారిశుధ్య కార్మికులు శుక్రవారం ఉరితాళ్లకు వేలాడుతున్నట్లు నిరసన తెలిపారు. సంఘ అధ్యక్షుడు సంతోష్‌కుమార్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో పారిశుధ్య కార్మికులు నిరవధిక సమ్మె చేస్తూ తమ న్యాయమైన డిమాండ్లు అడిగినా ప్రభుత్వం స్పందించకపోవడం విచారకరమన్నారు. కార్యక్రమంలో సంఘ నాయకులు తారకేశ్వరరావు, శ్రీనివాస్, వాసు, శ్రీను పాల్గొన్నారు.

ఎన్నికల హామీలు నిలబెట్టుకోండి..

ఇచ్ఛాపురం: ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నిలబెట్టుకోవాలని సీఐటీయూ జిల్లా నాయకుడు రమేష్ పట్నాయక్ అన్నారు. శుక్రవారం 11వ రోజు మునిసిపల్ కార్యాలయం ఎదురుగా ఏర్పాటు చేసిన శిబిరం వద్ద నిరసన వ్యక్తం చేశారు. తమ సమస్యలు పరిష్కరించకపోతే వచ్చే ఎన్నికల్లో వైసీపీ ప్రభుత్వం 'గోవిందా... గోవిందా' అవుతుందని నినాదాలు చేశారు.

పొర్లు దండాలు పెట్టి..

కాశీబుగ్గ: సమస్యలను పరిష్కరిస్తానని సీఎం ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని మునిపిసల్ పారిశుధ్య కార్మికులు డిమాండ్ చేశారు. ఈ మేరకు చేపట్టిన నిరవధిక సమ్మె 11వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా శుక్రవారం కార్మికులు గాంధీ విగ్రహం ఎదుట పొర్లు దండాలు పెట్టి నిరసన తెలిపారు. టీడీపీ నాయకులు పాల్గొని కార్మికులకు సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి గణపతి, నాయకులు మురుగన్, రవి, శంకర్ తదితరులు పాల్గొన్నారు.


ఆమదాలవలస: ఉరితాళ్లతో నిరసన తెలుపుతున్న కార్మికులు


దండాలతో నిరసన తెలుపుతున్న మునిసిపల్ పారిశుధ్య కార్మికులు